సాక్షి మంచిర్యాల

గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



పొగతో ఉక్కిరి బిక్కిరి

డంప్ యార్డులో చెత్తకు నిప్పంటిస్తుండడంతో దట్టంగా పొగ కమ్ముకుని బెల్లంపల్లి పట్టణ ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రి పాలవుతున్నారు. 18లో▸



ప్రతిభను వెలికి తీసే వేదిక

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసే వేదిక ఎస్‌పీఎల్ అని మంత్రి కమలాకర్ అన్నారు. 'సాక్షి' ప్రీమియర్ లీగ్ సీజన్–4 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. 18లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0 /18.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. కనిష్ఠ ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గి, పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. చలిగాలులు వీస్తాయి.

రైతులకు ఊరట..!

- గని కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు లేదు..
- ఆదాయ పన్ను పరిధి పెంపుతో కొంత ప్రయోజనం
- కొత్త రైళ్లు, రైల్వేస్టేషన్ల ఆధునీకరణ లేదు..
- మహిళలు, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం
- కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల పెదవి విరుపు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆదాయ పన్ను మినహాయింపు లభిస్తుందని ఎదురు చూసిన సింగరేణి కార్మికులకు ఈ బడ్జెట్‌లోనూ నిరాశే ఎదురైంది. ఏళ్లుగా కార్మికులు తమ జీతాల నుంచి రూ.లక్షలు ఆదాయ పన్ను చెల్లించాల్సి వస్తోంది. బుధవారం పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఆదాయ పన్ను పరిధిని రూ.7లక్షలకు పెంచడంతో ఆ స్లాబ్ పరిధిలో కొంత ఊరట కలుగనుంది. ఇక సింగరేణికి ఈ బడ్జెట్‌లో రూ.1650కోట్లు కేటాయించడంతో సంస్థ అభివృద్ధికి తోడ్పడనుంది. మొత్తంగా కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు.

పెరగనున్న రుణ పరిమితి

ఈ ఏడాది రైతులు, అనుబంధ రంగాలకు రూ.20లక్షల కోట్లు రుణాలు ఇవ్వనున్న నేపథ్యంలో జిల్లా రైతులకు ఉపయుక్తం కానుంది. జిల్లాలో 1.47లక్షల మంది రైతులు ఉన్నారు. ఈ ఏడాది రుణ లక్ష్యం రూ.1600 కోట్లుగా ఉంది. తాజాగా బడ్జెట్ కోటాతో రుణ పరిమితి మరింత పెరుగనుంది. పీఎం ప్రణామ్ కింద రసాయన ఎరువులు తగ్గించేందుకు పది వేల బయో ఇన్పుట్స్ రిసోర్స్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలో ఈ కేంద్రాలు ఏర్పడితే రైతులకు మేలు జరుగనుంది. పత్తి దిగుబడులు పెంచడం, స్టార్టప్ వంటివి జిల్లా రైతాంగానికి ఉపయుక్తంగా ఉండనుంది. జిల్లాలో అధికంగా పత్తి 1.54లక్షల ఎకరాల్లో సాగవుతోంది. పీఎం ఆవాస్ యోజన కింద రూ.79వేల కోట్లు కేటాయించడంతో జిల్లాలో గూడు లేని నిరుపేదలకు ఇల్లు కట్టుకునేందుకు ఉపయోగపడనుంది.

పన్ను పరిధి పెంపు

ఆదాయ పన్ను పరిమితి రూ.5లక్షల నుంచి రూ.7లక్షలకు పెంచడంతో వేతన, ఆదాయపన్ను పరిధి వారికి భారీ ఊరట కలిగింది. సీనియర్ సిటిజన్లు రూ.15లక్షల నుంచి 30లక్షల వరకు పన్ను పరిధి పెంచారు. దీంతో జిల్లాలో విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లకు ప్రయోజనం దక్కనుంది. ఎలక్ట్రిక్ వాహనాలు ధరలు తగ్గడంతో ఊరట కలుగనుంది. జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ధరల తగ్గింపుతో మరిన్ని అమ్మకాలు జరుగనున్నాయి. ఇక మొబైల్, ల్యాప్‌టాప్‌ల ధరలు తగ్గనున్నాయి. బంగారం, ప్లాటినం, వెండి, సిగరెట్లు, టైర్లు తదితర వాటితోపాటు వాహనాలపై పన్నులు పెంచారు. పాన్ కార్డును 13రకాల గుర్తింపు వాడకం ఇవ్వడంతోనూ సులభతరం కానుంది.

మహిళలకు సమ్మాన్ సేవింగ్స్

రెండేళ్ల కాలానికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు గరిష్ఠంగా రూ.2లక్షల వరకు 7.5శాతం స్థిర వడ్డీ పొందేలా అవకాశం ఉంది. జిల్లాలో మహిళా సంఘాలు 16,570 ఉండగా, ఇందులో 1.71లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరే కాకుండా మహిళలు ఎవరైనా సమ్మాన్స్ సేవింగ్స్ ఖాతాలో డిపాజిట్ చేసుకోవచ్చు.

కొత్త రైళ్లు లేవు

రైల్వే ప్రయాణికులు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న కొత్త రైళ్లు ఏవీ బడ్జెట్‌లో ప్రకటించలేదు. పండుగ, ప్రత్యేక రోజుల్లో విపరీతమైన రద్దీతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బల్లార్షా, కాజీపేట, కరీంనగర్ మధ్య ప్యాసింజ రు రైళ్లు నడపాలని విన్నవిస్తున్నా పట్టించుకో వడం లేదు. ఈ ఏడాది రూ.2.40లక్షల కోట్లు కే టాయించడంతో ప్రస్తుతమున్న కోచ్‌లకు ఆధునీకరణ చేయనున్నారు. బొగ్గు రవాణా, ఎరువులు, ఆహార ధాన్యాల రవాణా చేసే చోట్ల అభివృద్ధి చేయనున్నారు. జిల్లాగుండా సింగరేణి బొగ్గు, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి ఎరువులు, స్థానిక ఎఫ్‌సీఐ నుంచి బియ్యం ర వాణా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జి ల్లాలో రైల్వే ట్రాక్‌ల సామర్థ్యం కూడా పెంచనున్నారు. ట్రాక్ సామర్థ్యం పెరిగితే ప్రయాణ సమయం ఆదా కానుంది.

తెలంగాణపై వివక్ష



బెల్లంపల్లి: కేంద్రం బడ్జెట్‌లో మరోసారి తెలంగాణకు మొండి చెయ్యి చూపింది. రాష్ట్ర ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకున్నట్లు కనిపించలేదు. ఖాజీపేట్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసు లేకుండా పోగా, రాష్ట్రానికి ఒక మెడికల్ కళాశాలను కూడా కేటాయించలేదు. ఉపాధి హామీ పథకం నిధుల్లో రూ.30 వేల కోట్లు కోత పెట్టింది. రైతులు, చేతివృత్తులకు చేయూతనిచ్చే చర్యలు వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెల గారడి తప్పా అభివృద్ధి లేదు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.

– ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బెల్లంపల్లి

రైతు వ్యతిరేక బడ్జెట్



మంచిర్యాలటౌన్: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా రైతు వ్యతిరేక బడ్జెట్. ఎరువుల సబ్సిడీలు, ఉపాధి హామీ నిధులు తగ్గించారు. రాష్ట్రానికి తక్కువ నిధులు కేటాయించి బీజేపీ పాలిత రాష్ట్రాలు, ఎన్నికలు ఉన్న కర్ణాటక రాష్ట్రానికి అధికంగా నిధులు కేటాయించి రాష్ట్రానికి మొండిచేయి చూపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేదు. బీసీ, మైనారిటీల సంక్షేమానికి నిధులు కేటాయించకుండా అన్యాయం చేశారు.

– నడిపెల్లి దివాకర్‌రావు, మంచిర్యాల ఎమ్మెల్యే

కార్పొరేట్లకు లబ్ధి



మంచిర్యాలటౌన్: సామాన్య ప్రజలపై ధరల భారాన్ని పెంచి కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర బడ్జెట్ ఉంది. వ్యవసాయ పనులు లేని సమయాల్లో పేదలకు ఉపాధి కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి పేదలకు అన్యాయం చేశారు. ఎరువులపై సబ్సిడీలు తగ్గించి రై తులపై భారం మోపారు. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపును ఇస్తామని మొండి చేయి చూపించారు.

– కొక్కిరాల సురేఖ, డీసీసీ అధ్యక్షురాలు

సింగరేణి కార్మికులకు మేలు



మంచిర్యాలటౌన్: కేంద్రం ఈ ఏడాది బడ్జెట్‌లో ఆదాయపన్ను మి న హాయింపును రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచింది. దీని వల్ల సింగరేణి కార్మికులకు లబ్ధి చేకూరనుంది. ఆదాయపు పన్ను చెల్లింపులో కార్మికులకు కొంతవరకు మేలు కలుగనుండగా, ప్రజలకు సైతం లాభం చేకూరనుంది. సింగరేణికి సైతం ఈ బడ్జెట్‌లో రూ.1,650 కోట్లు కేటాయించారు.

– రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- కలెక్టర్ భారతిహోళ్లికేరి
- 'మన ఊరు–మనబడి' ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ భారతీ హోళ్లికేరి



సబ్బేపల్లిలోని ఆట పరికరాల్లో ఎమ్మెల్యే దివాకర్

మందమర్రిరూరల్/లక్సెట్టిపేట: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. బుధవారం మందమర్రి పట్టణంలోని పిల్లర్‌బెడ్ ఏరియాలో మన బస్తీ–మన బడి పథకం కింద రూ.14లక్షల వ్యయంతో నూతన హంగులతో నిర్మించిన పాఠశాల భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ట్రెయినీ కలెక్టర్ గౌతమిలతో కలిసి ప్రారంభించారు. లక్సెట్టిపేట మండలం గుల్లకోట గ్రామంలో పాఠశాలను ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భారతిహోళ్లికేరి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని, విద్యార్థులు ఇష్టపడి ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, జెడ్పీ సీఈవో నరేందర్, డీఈవో వెంకటేశ్వర్లు, ఎంపీపీ గుర్రం మంగ శ్రీనివాస్, జెడ్పీటీసీ రవి, ఎంఈవో ఆడి పోచయ్య, సర్పంచ్ గోళ్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు పునాది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థుల ఉజ్వల భవితకు ప్రభుత్వ పాఠశాలలు పునాది వంటివని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం సబ్బేపల్లి గ్రామంలో 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా తీర్చిదిద్దిన మండల పరిషత్ పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.16 లక్షలతో పాఠశాలలో మౌలిక వసతులు, పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కాగా, పాఠశాల అభివృద్ధికి రూ.5లక్షలు విరాళంగా అందజేసిన మాజీ జెడ్పీటీసీ హరిప్రియ, వినయ్‌ప్రకాశ్ దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- రెండు జిల్లాల బాధ్యతలు స్వీకరణ





బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధికి అధికారుల సహకారంతో కృషి చేస్తానని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టర్ల సాధారణ బదిలీల్లో భాగంగా కలెక్టర్ భారతిహోళ్లికేరి రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న బదావత్ సంతోష్‌ను మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా నియమించారు. బుధవారం ఆయన మంచిర్యాల కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. సంతోష్‌కు భారతి హోళ్లికేరి స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. మంచిర్యాల జిల్లాతోపాటు కుమురంభీం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్(ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు ఇక్కడే స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ పత్రాలపై సంతకం చేసి కుమురంభీం జిల్లా కలెక్టరేట్ ఏవోకు అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌రాజ్, మధుసూదన్‌నాయక్, ట్రెయినీ కలెక్టర్ గౌతమిలను భారతిహోళ్లికేరి సంతోష్‌కు పరిచయం చేశారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హైలైఫ్ హోటల్ ఏర్పాటు చేసిన వీడ్కోలు, స్వాగత సమావేశంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదనపు బాదుడు

- సామాన్యులపై విద్యుత్ చార్జీల భారం
- ఏసీడీ చార్జీల మోత.. భగ్గుమంటున్న ప్రజలు
- చెల్లించాల్సిందేనంటున్న అధికారులు





ఏసీడీ చార్జీ రూ. 47,276 వచ్చిన బిల్లు, ఏసీడీ చార్జీ 2,020 బిల్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: కరెంటు చార్జీలు పెంచకుండా అదనపు చార్జీల బాదుడుతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. గత ఏడాది అభివృద్ధి చార్జీలు, కిలోవాట్ పెరిగిందని చార్జీలు వసూలు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏసీడీ(అదనపు కన్‌జంప్షన్ డిపాజిట్) వసూలు చేస్తున్నారు. ఇదివరకు నెలకు 300 యూనిట్ల కంటే అధికంగా వినియోగించే వారికి మాత్రమే ఏసీడీ వసూలు చేసేవారు. ప్రస్తుతం అంతకంటే తక్కువ యూనిట్లు వినియోగించినా తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా సర్వీసు సామర్థ్యం కంటే అధికంగా విద్యుత్ వినియోగించే వారికి ఏసీడీ సెక్యూరిటీ డిపాజిట్ అని పేర్కొంటున్నారు. గతేడాది ఇష్టానుసారంగా బిల్లులు పెంచడంతోపాటు వివిధ చార్జీలు వడ్డించిన విద్యుత్ సంస్థలు ఏడాది గడవక ముందే మళ్లీ ఏసీడీ చార్జీలు వసూలు చేయడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెల్లించేందుకు నిరాకరిస్తున్నారు. చెల్లించకుంటే ఫైన్‌తో మళ్లీ చార్జీ పడుతుందని విద్యుత్ సిబ్బంది పేర్కొంటున్నారు.

గతేడాది..

విద్యుత్ అధికారులు గతేడాది రెండుసార్లు భారం మోపారు. గృహ వినియోగదారులకు యూనిట్‌కు 50 పైసల చొప్పున పెంచారు. దీనివల్ల రూ.300 నుంచి రూ.400 బిల్లు అధికంగా వస్తోంది. ఇవి కాకుండా నెలవారీగా కస్టమర్ చార్జీలు విధిస్తూనే ఉన్నారు. అనుమతి పొందిన లోడ్ కంటే అధికంగా వాడుతున్నారంటూ భారీగా డెవలప్‌మెంట్ చార్జీలు విధించారు. రూ.2 వేల నుంచి మొదలుకొని రూ.6 వేల వరకు చార్జీలు విధించారు. మీటర్ ఉన్న ఒక్కో వినియోగదారునిపై వేల రూపాయల చార్జీలు వేశారు. తాజాగా ఏసీడీ చార్జీలు వసూలు చేస్తోంది.

ఏసీడీ అంటే..

ఇంటికి విద్యుత్ మీటర్ తీసుకునే సమయంలో విద్యుత్ శాఖ కొంత మొత్తాన్ని డిపాజిట్‌గా తీసుకుంటుంది. ఇటీవల విద్యుత్ వినియోగం పెరగడంతో రెండు నెలలకు సరిపడా డిపాజిట్ డబ్బులు విద్యుత్ సంస్థ వద్ద ఉంచాల్సి ఉంటుంది. దీనినే (ఏసీడీ) అడిషనల్ కంజప్షన్ డిపాజిట్ అంటారు. ఈ డబ్బులకు బ్యాంకు రేటు ప్రకారం వడ్డీ కూడా ప్రతీ సంవత్సరం మేలో బిల్లులో తగ్గించి ఇస్తారు. ఒక వేళ డిపాజిట్ తక్కువగా ఉన్నట్లయితే అదనపు డిపాజిట్ కట్టాల్సిందిగా విద్యుత్ సంస్థ అడుగుతుందని, ఇది కేవలం డిపాజిట్ మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. వినియోగదారులు సర్వీసులు రద్దు చేసుకున్నప్పుడు డిపాజిట్ డబ్బులు తిరిగి చెల్లిస్తారు.

ఈఆర్‌సీ సమావేశంలో నిలదీతకు సిద్ధం

జిల్లాలో ఈ నెలలో నిర్వహించే విద్యుత్ వినియోగదారుల సమావేశంలో ఏసీడీ చార్జీలపై నిలదీసేందుకు వినియోగదారులు సిద్ధం అవుతున్నారు. గతంలో 300 యూనిట్లు పైబడి ఉన్న వారికి మాత్రమే ఏసీడీ బిల్లులు తీసుకోగా ప్రస్తుతం పేద, మధ్య తరగతి వారిపై ఈ భారం పడడంతో సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దినసరి కూలీ, సామాన్య, నెల వారి వేతన జీవులు వేలల్లో వస్తున్న ఏసీడీ చార్జీలు చూసి విద్యుత్ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు.

జిల్లాలో కేటగిరీల వారీగా విద్యుత్ కనెక్షన్లు

గృహాలు	2,52,160
వాణిజ్యం	29,999
మధ్యతరహా పరిశ్రమలు	1,451
చిన్నతరహా పరిశ్రమలు	43
వ్యవసాయం	44,953
పంచాయతీ, మున్సిపాలిటీ	3,173
దేవాలయాలు, మసీదు, చర్చిలు	2,559
పాఠశాలలు	1391
ఇతర(తాత్కాలిక కనెక్షన్లు)	129
మొత్తం	3,34,965

రూ.47 వేలు ఎలా చెల్లించేది



నెల బిల్లు వచ్చేది వాడుకు న్న కరెంటుకు వందల్లో వ స్తుంది. ఈ నెల ఏసీడీ చా ర్జీ పేరుతో వచ్చిన బిల్లుతో రూ.47,276 బిల్లు చూసి గుండె గుబేల్‌మన్నది. చేసుకునేది వ్యవసాయం.. గింత బిల్లు ఎట్లా కట్టేదని ఏఈకి ఫిర్యాదు చేసిన. ఈ బిల్లు నేను కట్టలేను.

– పూదరి రమేష్, గ్రామం: గొల్లపల్లి, మం: నెన్నెల

రూ.23 వేల బిల్లు..



రెండు మూడు వందల కరెంటు బిల్లు వచ్చేది. ఇప్పుడు ఏసీడీ చార్జీలని రూ.23 వేల బిల్లు వేసిండ్లు. బిల్లు చూసి నోరెల్లబెట్టుడు అయింది. వేలకు వేలు పోయిన ఏడాది ఈ ఏడాది రూ.23 వేలు ఎట్లా కట్టుడు. ఇష్టమచ్చినట్లు కరెంటు బిల్లు వేస్తున్నారు. కట్టకుంటే కట్ చేస్తమంటున్నారు.


– దాసరి ఎల్లయ్య, నెన్నెల

డిపాజిట్ మాత్రమే..

విద్యుత్ బిల్లులతోపాటు ఏసీడీ చార్జీలు వేయడం జరుగుతుంది. ఇది గతంలో 300 యూనిట్లు పైబడిన వారికి మాత్రమే ఉండేది ప్రస్తుతం 300 యూనిట్లలోపు తీసుకోవడం జరుగుతుంది. వినియోగదారుల రెండు నెలల డిపాజిట్ మాత్రమే. ఈఆర్‌సీ నిర్ణయం మేరకు ఏసీడీ చార్జీలు వేయడం జరుగుతుంది.

– శేషారావు, జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ

ఉపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన



డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన స్థానిక డీఈవో కార్యాలయంలో బుధవారం కొనసాగింది. పదోన్నతుల నిమిత్తం అర్హుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన, సీనియారిటీ జాబితాకు తుదిరూపు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల నిమిత్తం జిల్లా నుంచి అవకాశం ఉన్న స్కూల్ అసిస్టెంట్ల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి తుది జాబితాను ఆర్జేడీకి నివేదించనున్నారు. బదిలీలు, పదోన్నతులకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ బుధవారం ముగిసింది. జనవరి 31 వరకు 1,196 దరఖాస్తులు డీఈవో కార్యాలయానికి చేరాయి. ఒక వైపు సర్వీసు రిజిష్టర్ పరిశీలన, మరోవైపు ఆన్‌లైన్ బదిలీల దరఖాస్తు ప్రక్రియ ఏకకాలంలో సాగాయి. ఖాళీల వివరాలు, సీనియార్టీ జాబితా ప్రకటన, కౌన్సెలింగ్ తదితర అంశాల్లో వివాదాలు తలెత్తకుండా జాగ్రత్త పడుతున్నారు. స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ) నుంచి హెచ్ఎం గ్రేడ్ –2, సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. ఉపాధ్యాయ ఉద్యోగోన్నతి, బదిలీ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు సత్యదేవుడి కల్యాణం



భజన చేస్తున్న కళాకారులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ప్రత్యేక పూజలు, సప్తాహ భజనలు కొనసాగాయి. కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రమా సహిత సత్యనారాయణస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. గుట్టపైన ప్రధాన ఆలయం పక్కన స్వామివారి కల్యాణానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు తరలి రావాలని ఆలయ ఈవో శ్రీనివాస్, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రఘుస్వామి, సంపత్‌స్వామి కోరారు.

తరగతుల బహిష్కరణ

మంచిర్యాలఅర్బన్: భాషా పండితులకు పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి 9, 10 తరగతులను బహిష్కరించినట్లు రాష్ట్ర పండిత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణచారి తెలిపారు. దశలవారీ ఆందోళనలో భాగంగా జాబ్ చార్ట్ ప్రకారం 6, 7, 8వ తరగతులు మాత్రమే బోధిస్తామని, అదనపు అలవెన్స్ రూ.150 తీసుకోకుండా 9, 10వ తరగతుల బోధనను బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్, డీఈవో, అన్ని ఉన్నత పాఠశాల హెచ్ఎంలకు ఇదివరకే తరగతుల బహిష్కరణ వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనకు కృషి



వైద్యులకు సూచనలు చేస్తున్న అజయ్‌కుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ జే.అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆయన సందర్శించారు. డయాలసిస్ కేంద్రాన్ని ప్రత్యేకంగా పరిశీలించారు. రోగులకు మౌళిక వసతులు, వైద్య పరికరాలు, రోజువారీగా వస్తున్న ఔట్ పేషంట్స్, ఆస్పత్రిలో చేరుతున్న రోగుల సంఖ్యపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని అన్నారు. వైద్యులు, సిబ్బంది నియామకానికి మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ అరవింద్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవి, వైద్యులు వరుణ్‌కుమార్, ప్రమోద్, రవళి పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి బీజేపీ'



మాట్లాడుతున్న రఘునాథ్

దండేపల్లి: వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ధీమా వ్యక్తం చేశారు. దండేపల్లిలో బుధవారం మండల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గూడెం ఎత్తి పోతల పథకం విషయంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు అబద్ధపు మాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. గూడెం పైప్‌లైన్ మార్చాలన్న ప్రతిపాదన 2021లోనే అసెంబ్లీలో ప్రస్తావనకు వచ్చినప్పటికీ ఇప్పటికి తొలగించకుండా, పైప్‌లైన్ మార్పు కోసం వినతపత్రం అందించినట్టు కొత్త నాటకం ఆడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు శ్రీనివాస్, మల్లికార్జున్, ప్రభాకర్, రవిగౌడ్, శేఖర్, రాజేశ్వరి, కిషన్, శ్రీనివాస్, మల్లేష్, రవీందర్, అనిల్, వెంకటేష్, రాకేష్ పాల్గొన్నారు.

సమ్మక్క జాతర ప్రారంభం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలఅర్బన్: స్థానిక గోదావరి నది ఒడ్డున సమ్మక్క జాతర ప్రారంభమైంది. బుధవారం సమ్మక్క–సారాలమ్మ జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గద్దెల వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటీ ఈవో ముక్తా రవి, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, సభ్యులు నరెండ్ల శ్రీనివాస్, సుంకరి రమేష్, కౌన్సిలర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

వాంకిడి(ఆసిఫాబాద్): మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఖిరిడి గ్రామానికి చెందిన వడ్లూరి చంద్రమ్మ (58), రామయ్య దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా భర్త, ముగ్గురు కుమారులు మద్యానికి బానిసయ్యారు. ఇంటిని పట్టించుకోకుండా పనికి వెళ్లగా వచ్చిన డబ్బులన్నీ తాగడానికే ఖర్చు పెడుతుండేవారు. దీంతో మనస్తాపం చెందిన చంద్రమ్మ మంగళవారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి సోదరుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డీజే యజమానికి రూ.లక్ష జరిమానా

భీమిని(బెల్లంపల్లి): అనుమతి లేకుండా డీజే పెట్టినందుకుగానూ సదరు యజమానికి భీమిని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన శ్రావణ్‌కుమార్ గతేడాది అక్టోబర్ 6న భీమిని మండలంలోని కేస్లాపూర్‌లో దుర్గామాత నిమజ్జనంలో అనుమతి లేకుండా డీజే పెట్టడంతో పోలీసు కేసు నమోదైంది. దీంతో విచారణ అనంతరం డీజే యజమానికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి జైలు

దండేపల్లి(మంచిర్యాల): బైండోవర్ ఉల్లంఘన కేసులో ఒకరికి జైలుశిక్ష విధించినట్లు లక్సెట్టిపేట సీఐ బాబా తెలిపారు. మండలంలోని తానిమడుగుకు చెందిన మాలవత్ రమేశ్ నాటుసారా అమ్ముతూ పలుమార్లు పట్టుబడ్డాడు. దీంతో అతన్ని గతంలో దండేపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ నాటుసారా అమ్మి బైండోవర్ ఉల్లంఘించాడు. దండేపల్లి తహసీల్దార్ హన్మంతరావు రూ.లక్ష జరిమాన విధించారు. చెల్లించకపోవడంతో వచ్చే మార్చి వరకు అతనికి జైలు శిక్ష విధించారు. బుధవారం నిందితుడిని జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం నామానగర్ వద్ద బుధవారం ద్వి చక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీకి చెందిన అర్జున్ ప్రసాద్, తాజ్, సయ్యద్ షారుక్(23) బైక్‌పై పట్టణం నుంచి పెంచికల్‌పేట్ వైపు బయలుదేరారు. నామానగర్ మూలమలుపు వద్ద వీరి ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన షారుక్‌ను మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గాయపడిన అర్జున్ ప్రసాద్ చికిత్స పొందుతుండగా, తాజ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఈజీగాం పోలీసులు తెలిపారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి



రాత్రిపూట రోడ్డుపై కమ్ముకున్న పొగ

- డంప్‌యార్డులో చెత్తకు నిప్పు
- ఊరంతా కమ్ముకుంటున్న పొగ
- అనారోగ్యం బారిన ప్రజలు

బెల్లంపల్లి: డంప్‌యార్డులో చెత్తకు నిప్పంటిస్తుండగా దట్టంగా పొగ కమ్ముకుని పురప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అందరూ శ్వాస తీసుకోవడానికి సతమతమవుతున్నారు. రాత్రిపూట గంటల కొద్దీ పొగ కమ్ముకుని ఉంటుండగా వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు నిద్రలేమికి గురవుతున్నారు. పొగ నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో బస్తీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ ఏరియా శివారు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో కొన్నాళ్ల క్రితం డంప్‌యార్డును ఏర్పాటు చేశారు. ఆ భూమి ప్రస్తుతం స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధిలోకి వెళ్లడంతో అక్కడి నుంచి శాంతిఖని బస్తీ శివారు ప్రాంతంలో కొత్తగా డంప్‌యార్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. రెవెన్యూ అధికారులు పదెకరాల ప్రభుత్వ భూమి మంజూరు చేశారు. అయితే ఇప్పటివరకు కొత్తగా ప్రతిపాదించిన డంప్‌యార్డు పనులు ప్రారంభం కాకపోవడంతో రోజువారీగా సేకరిస్తున్న చెత్తను వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రహరీని ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశంలో పడేస్తున్నారు. అక్కడ చెత్త కుప్పలుతెప్పలుగా పేరుకుపోయింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన చెత్తాచెదారం గుట్టలను తలపిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని చెత్తకు రాత్రి పూట నిప్పంటిస్తున్నారు. చెత్త, వ్యర్థపదార్థాలకు మంట అంటుకుని దట్టంగా పొగ కమ్ముకుని ఉంటోంది. సమీపంలోని కన్నాల బస్తీ, టేకుల బస్తీ, మధునన్న నగర్, కాంట్రాక్టర్ బస్తీ, ఫుట్‌బాల్‌గ్రౌండ్‌బస్తీ, కొత్తబస్టాండ్ ఏరియా ఇందిరమ్మకాలనీ, పాత బస్టాండ్ ఏరియా, బజారు ఏరియా, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పొగ ప్రభావం తీవ్రంగా ఉంటోంది.

డంప్‌యార్డు ఎత్తివేయాలి



దినాం పొగ కమ్ముకుని ఉంటోంది. నిద్రపోయే యాళ్లకు ఎవరో చెత్తకు నిప్పు పెడుతున్నరు. చెత్తకు నిప్పంటుకుని పొగంతా ఇంటిలో వ్యాపిస్తుండగా విపరీతమైన దగ్గు వస్తోంది. కండ్లు మండుతన్నయ్. సరిగా నిద్ర పట్టడం లేదు. డంప్‌యార్డు జనావాసాలకు చేరువలో ఉండడంతో పొగ భరించలేక పోతున్నాం. వెంటనే చెత్తకు నిప్పు చెట్టడాన్ని ఆపేసి డంప్‌యార్డును అక్కడి నుంచి ఎత్తివేయాలి.

– కన్నూరి ఓదెలు, స్థానికుడు

అప్పటి ఇబ్బందులు వద్దు



డంప్‌యార్డు నిర్వహణను మున్సిపల్ అధికారులు కొన్నినెలలుగా పట్టించుకుంటలేరు. కనీస చర్యలు తీసుకోకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. రాత్రివేళ డంప్‌యార్డు, ఇతర ప్రాంతాల్లో ఉన్న చెత్తకు నిప్పు పెడుతుండగా వచ్చే పొగ మామూలుగా ఉండడం లేదు. దట్టంగా వ్యాపించి ఊపిరి సలపకుండా చేస్తున్నది. వృద్ధులు, పిల్లలు భరించ లేకపోతున్నారు. ఆస్తమా పేషెంట్ల పరిస్థితి దారుణం. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని ఇబ్బందులు లేకుండా చూడాలి.

– చింతల బాలరాజు, స్థానికుడు

పక్షం రోజుల నుంచి..

గడిచిన పక్షం రోజులుగా చెత్తకు ఇష్టారాజ్యంగా నిప్పంటిస్తున్నారు. చీకటి పడగానే నిప్పు పెడుతుండడంతో క్రమంగా పొగ వ్యాప్తి చెందుతోంది. రాత్రి 10 గంటల నుంచి సమీప ప్రాంతాలన్నీ పొగతో కమ్ముకుని ఉంటున్నాయి. మరో వైపు పొగతో గాలి కలుషితమవుతోంది. సరిగ్గా నిద్రకు ఉపక్రమించే వేళ పొగ దట్టంగా ఇళ్లలో వ్యాపిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇంటి కిటికీలు మూసి ఉన్నా లోపలికి పొగ వ్యాప్తి చెంది ఇబ్బంది పడుతున్నారు. పొగ బారి నుంచి కాపాడుకునే చర్యలు కానరాక అనేకమంది దగ్గుతో బాధ పడుతున్నారు. శ్వాస తీసుకోలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, అస్తమా వ్యాధి గ్రస్తుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటోంది. పొగ కారణంగా గంటల కొద్దీ సమయం నిద్రపట్టకుండా గడుపుతున్నామని పలు బస్తీల ప్రజలు పేర్కొంటున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న పొగతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. చెత్తకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవడం లేదు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకుని పొగ నుంచి కాపాడాలని పురప్రజలు కోరుతున్నారు.

ఖైదీలు క్రమశిక్షణ కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి అసుదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట(మంచిర్యాల): అండర్ ట్రయల్ ఖైదీలు క్రమశిక్షణ కలిగి ఉండాలని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసుదుల్లా షరీఫ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌జైల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలు చేసి కోర్టులు, జైళ్ల చుట్టూ తిరిగి సమయాన్ని, భవిష్యత్‌ను వృథా చేసుకోవద్దన్నారు. జైల్‌లో క్రమశిక్షణతో పాటు పరిశుభ్రతను పాటించాలని, భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఉండాలన్నారు. అనంతరం జైలు పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలర్ స్వామి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, న్యాయవాది తాజొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి అసుదుల్లా షరీఫ్

విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలి

పాతమంచిర్యాల: విద్యుత్ వినియోగ దారులపై విధిస్తున్న అదనపు చార్జీ(ఏసీడీ)లను రద్దు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న తెలంగాణ ప్రజలపై విద్యుత్ సంస్థలు నష్టాల పేరుతో ప్రజలపై భారం మోపడం దుర్మార్గమైన చర్య అన్నారు. విద్యుత్ సంస్థల నష్టాలకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చాంద్ పాషా, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి అందె మంగ, ఆలిండియా కిసాన్ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు లాల్‌కుమార్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, ఐఎఫ్‌టీయూ నాయకుడు తోకల తిరుపతి, పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు జ్యోతి, అరుణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, అరుణోదయ జిల్లా కార్యదర్శి మల్లన్న, పీవైఎల్ నాయకులు సాజిద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న బీసీ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని ఆర్కే 6 గని మేనేజర్ ఈ.తిరుపతి సూచించారు. బుధవారం గనిపై సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. ఇందుకు గనుల వారీగా పిట్ కమిటీ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గని వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, డెప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, అండర్ మేనేజర్ ప్రశాంత్, ఇంజినీర్ మహేశ్, సర్వే అధికారి వర్మ, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు వెంగళ కుమారస్వామి, గొర్రె నర్సయ్య, గోర్ల సంతోశ్, ఇప్ప భూమయ్య, సంఘం సదానందం, తోట మహేశ్, మేడారం సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీసీ ఉద్యోగులు

బీపీఏలో 82 శాతం బొగ్గు ఉత్పత్తి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో జనవరి నెలలో 82 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జనరల్ మేనేజర్ దేవేందర్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఏరియాలో బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. జనవరిలో ఏరియాకు 3.5లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేషించగా 3.04 లక్షల టన్నులతో 82 శాతం ఉత్పత్తిని నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఏరియా 28.70 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 21.31 లక్షల టన్నులతో 74 శాతంతో ముందుకెళ్తున్నామన్నారు. ఏరియాకు నిర్దేషించిన వార్షిక లక్ష్యాన్ని పూర్తి చేస్తామని, అందుకు ఏరియాలోని ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, ఐఈడీ డీజీఎం పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జీఎం దేవేందర్

‘అదృశ్యం కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలి’

కాగజ్‌నగర్‌టౌన్: తమ కుమారుడి అదృశ్యం కేసుపై సమగ్ర విచారణ చేపట్టాలని కొమ్ము దీక్షిత్ తల్లిదండ్రులు చక్రవర్తి, భాగ్యలక్ష్మి దంపతులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న తమ కుమారుడు 2022 ఫిబ్రవరి 19న ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్లి పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. 2022 ఫిబ్రవరి 20న పెద్దపల్లి జిల్లా గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గోదావరి నదిలో ఓ గుర్తుతెలియని యువకుడి శవం లభ్యంకావడంతో పోలీసుల సమాచారం మేరకు అక్టోబర్ 18న వాటిని పరిశీలించగా చొక్కా కాదని, ప్యాంటు మాత్రం తమ కుమారుడిదేనంటూ పోలీసులకు వివరించారు. అక్టోబర్ 19న వ్యక్తి తాలుకూ వెంట్రుకలు, ఎముకలను డీఎన్ఏ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. నివేదిక ఇప్పటివరకు రాలేదన్నారు. తమ కుమారుడికి మంచిర్యాల జిల్లా ఐబీ తాండూరుకు చెందిన ఓ అమ్మాయితో పరిచయం ఉందని, ఆమె బంధువులే కొట్టి హత్య చేశారని ఆరోపిస్తున్నారు. ఈ కేసుపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి గంగుల



మేయర్ సునీల్‌రావు బ్యాటింగ్, మంత్రి కీపింగ్



తలపడుతున్న జట్లు

- విద్యార్థులు, యువత క్రీడా రంగంలో రాణించాలి
- సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4ను ప్రారంభించిన మంత్రి గంగుల

కరీంనగర్‌స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లోని మెరికల్లాంటి క్రీడాకారులను వెలికి తీసేందుకు ‘సాక్షి’ ప్రీమియర్ లీగ్ ఒక వేదికలాంటిదని, ‘సాక్షి’ మీడియా చేస్తున్న ప్రయత్నం అద్వితీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ‘సాక్షి’ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో, స్టేట్ స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 పోటీలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతోనే యువత, చిన్నారులు సన్మార్గాల్లో నడుస్తారన్నారు. యువత విద్యలోనే కాకుండా అన్నిరంగాల్లోనూ రాణించాలన్నారు. మేయర్ సునీల్ రావు, జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ సాగర్‌రావు మాట్లాడుతూ ఇలాంటి పోటీలు గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు సువర్ణావకాశమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి, మేయర్ బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అంతకుముందు ఉదయం జరిగిన పోటీలను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ ఏరియా మేనేజర్ షేక్ రఫీ, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, కార్పొరేటర్ ఎడ్ల అశోక్, కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, బ్యూరో ఇన్‌చార్జి అనిల్, ఏడీవీటీ మేనేజర్ లక్ష్మీనారాయణ, సర్క్యులేషన్ మేనేజర్ మధుకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు ఫలితాలు

జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, కరీంనగర్ జట్టు.. అల్ఫోర్స్ జూనియర్ కళాశాల, మంచిర్యాలపై గెలిచింది. ఎస్సారార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల జట్టు.. కాకతీయ జూనియర్ కళాశాల, గోదావరిఖని జట్టుపై విజయం సాధించింది. సీనియర్స్ విభాగంలో వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్ జట్టు వివేకానంద ఇంజనీరింగ్ కళాశాల, కరీంనగర్‌పై విజయం సాధించింది. జూనియర్స్ బ్యాటింగ్‌లో రిషి (అల్ఫోర్స్) 23 పరుగులు, ఫిరోజ్ (జ్యోతిష్మతి) 20 పరుగులు, హుర్రేయర్ (ఎస్సారార్) 19 పరుగులు చేసి అలరించారు. సీనియర్స్‌లో ఆదిల్ (వివేకానంద) 34 పరుగులు చేశారు. కాగా జూనియర్స్ విభాగంలో జ్యోతిష్మతి (కరీంనగర్), ఎస్సారార్ (మంచిర్యాల) జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.




వికెట్ తీసిన ఆనందంలో..

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు కాస్త ఊరట లభించినా ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుందని ఆశగా ఎదురు చూసిన సింగరేణి కార్మికులకు నిరాశే మిగిలింది. కేంద్ర బడ్జెట్‌పై జిల్లాలోని వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకుల అభిప్రాయాలు వాటి మాటల్లోనే...

పేదలకు అనుకూలం



ఆసిఫాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా ఉంది. రైతులు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుంది. ఏడాదికి రూ.7 లక్షల ఆదాయం ఉన్న వారికి ఇన్‌కంట్యాక్స్ కట్టాల్సిన అవసరం లేకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఎలక్ట్రానిక్, మొబైల్ ఫోన్ల ధరలు తగ్గనున్నాయి. ఆన్‌లైన్‌లో ఉద్యోగం చేసే వారికి పూర్తిగా బరువు తగ్గించారు. రైల్వే బడ్జెట్ రూ. 40 వేల కోట్లకు పెంచారు. రవాణా సౌకర్యానికి రూ. 3లక్షల కోట్లు కేటాయించారు.

– ఖాండ్రే విశాల్, బీజేపీ కుమురంభీం జిల్లా ఉపాధ్యక్షుడు

ఎరువుల రాయితీ తగ్గింపు



ఆసిఫాబాద్:ఎరువుల రాయితీ తగ్గించారు. ఉపాధి హామీకి కోత విధించారు. ఇన్సూరెన్స్‌కు ట్యాక్స్ లేకుండా చేసి దొంగదెబ్బ తీశారు. మహిళలకు ప్రోత్సాహకరంగా ఉంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు రూ.7 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయించడం హర్షనీయం.

– కొక్కిరాల విశ్వప్రసాదరావు, డీసీసీ అధ్యక్షుడు, కుమురంభీం జిల్లా

తెలంగాణపై వివక్ష



ఆసిఫాబాద్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు లేకపోవడం బాధాకరం. తెలంగాణ నుంచి నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నా విభజన హామీల ప్రస్తావన లేకపోవడం శోచనీయం. రైతుల సంక్షేమం, వ్యవసాయంపై శీతకన్ను వేశారు. మొత్తానికి బడ్జెట్ ఖాళీ డబ్బాలో గులకరాళ్లు వేసినట్లు ఉంది.

– కాంప్రె అనిల్‌కుమార్, ఓయూ జేఏసీ కన్వీనర్

కార్మికులకు నిరాశే



శ్రీరాంపూర్: కేంద్ర బడ్జెట్ బొగ్గు గని కార్మికులకు నిరాశే మిగిల్చింది. కోల్ సెక్టార్‌లో పనిచేసే కార్మికులకు రిస్క్ సెక్టార్‌గా గుర్తించి ఐటీమాఫీ చేయాలని చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చే ప్రధాన పార్టీ నేతలు హామి ఇచ్చి విస్మరిస్తున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా మాఫీ వస్తుందనుకుంటే రాలేదు.

– ఎస్కే బాజీసైదా, ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి

నిరాశే మిగిల్చింది



శ్రీరాంపూర్: ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌పై వచ్చే వడ్డీ రూ.2.5 లక్షలు దాటితే దానిపై ఐటీ వసూలు చేయడం వల్ల ప్రతి ఉద్యోగిపై దీని ప్రభావం పడుతుంది. గతేడాది నుంచి ఇది అమలు చేస్తున్నారు. దీని ప్రభావం దేశ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులపై పడుతోంది. ఈ సారైనా పీఎఫ్ వడ్డీపై ఐటీని మినహాయిస్తారని అనుకున్నా నిరాశే మిగిలింది.

– కూసి తిరుపతి, ఉపాధ్యాయుడు

కార్మిక వ్యతిరేకం



బెల్లంపల్లి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో పేద, సామాన్యులకు మేలు కలిగేలా లేదు. దేశసంపదను అంబానీ, ఆదానీలకు, సంపన్న వర్గాలకు దోచి పెట్టడానికి బడ్జెట్ ప్రతిపాదించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలకు ఊతం ఇవ్వడానికి ఏమాత్రం నిధుల కేటాయింపులు లేవు. కేంద్ర బడ్జెట్ పూర్తిగా కార్మిక వ్యతిరేకమైంది. – చిప్ప నర్సయ్య, ఏఐటీయూసీ నాయకుడు , బెల్లంపల్లి

అన్నివర్గాలకు అనుకూలం



బెల్లంపల్లి: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్నివర్గాల ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ఉంది. వ్యవసాయ రంగానికి రూ.20లక్షల కోట్లు కేటాయించడం వల్ల గ్రామీణ భారతం మరింత వృద్ధి చెందే అవకాశాలున్నాయి. దేశాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు బడ్జెట్‌లో సమతూకం పాటించారు. – సీహెచ్.కృష్ణదేవరాయలు, పీజీ విద్యార్థి, బోయపల్లి

ధరల నియంత్రణ ప్రస్తావనే లేదు



బెల్లంపల్లి: నిత్యావసరాల ధరలు రోజురోజుకూ చుక్కలనంటుతున్నాయి. గృహ నిర్మాణాల ముడిసరుకు ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న ధరలతో పేదలు పోటీ పడే పరిస్థితులు కనిపించడం లేదు. ధరల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను బడ్జెట్‌లో వివరించలేదు. ఇతర అంశాల్లో పర్వాలేదు. – రేఖ, గృహిణి, మాదారం